ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలి - కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ 8లో..

చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించడమే లక్ష్యం.. 8లో..



ఎస్సారెస్పీ నీటి సరఫరాలో గందరగోళం

- ఆన్అండ్ఆఫ్ విధానానికి అధికారుల తూట్లు
- నిరంతరంగా కాకతీయ కాలువకు నీటి సరఫరా
- మొదట 6 వేల క్యూసెక్కులు.. తర్వాత 3 వేలకు తగ్గింపు
- కాలువ చివరి భూములకు నీరందక రైతుల ఇక్కట్లు

(ఆంధ్రజ్యోతి. పెద్దపల్లి)

ఎస్సారెస్పీ నీటి సరఫరాలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సీజన్‌లో ఎస్సారెస్పీ ఆయకట్టు భూములకు సాగునీటిని విడుదల చేసే విషయంలో సంబంధిత అధికారులు తీసుకున్న నిర్ణయాల వల్ల రైతులకు శరాఘాతంగా మారింది. దీనివల్ల ఎన్నో ఆశలతో వరి నాట్లు వేసుకున్న రైతులు చివరి వరకు పంట చేతికి వస్తుందో, లేదోనని ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా ప్రతి సీజన్‌లో ఆన్అండ్ఆఫ్ పద్ధతిలో 5,500 క్యూసెక్కుల నుంచి 6 వేల క్యూసెక్కుల వరకు సాగు నీటిని సరఫరా చేస్తారు. 8 రోజులు నీటిని వదిలి, 7 రోజులు బంద్ చేస్తారు. ఈ సీజన్‌లో అలాగాకుండా అధికారులు కొత్త విధానాన్ని అమలుచేస్తుండడంతో జిల్లాలోని ఆయకట్టు చివరి భూములకు సరిపడా నీరందని పరిస్థితి ఏర్పడింది. గతనెల 18వ తేదీ నుంచి ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరాను ప్రారంభించారు. మెయిన్ కెనాల్ అయిన కాకతీయ కాలువకు ఆన్అండ్ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేయాల్సి ఉండగా, రెగ్యులర్‌గా నీటిని వదులుతున్నారు. వారం రోజుల పాటు జోన్ 1లో డీ-1నుంచి డీ- 53 వరకు జగిత్యాల వరకు తెరిచి ఆయకట్టు భూములకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఆ సమయంలో జోన్ 2 పరిధి డీ-54 నుంచి డీ-94 వరకు మూసివేస్తున్నారు. వారం రోజుల తర్వాత జోన్ 1 పరిధిలోని డీబీలను మూసి జోన్ 2 పరిధిలోని డీబీలను ఓపెన్ చేస్తున్నారు. అయితే మెయిన్ కెనాల్‌కు ఎస్సారెస్పీ నుంచి 3 వేల నుంచి 3,500 క్యూసెక్కుల నీటిని మాత్రమే వదులుతున్నారు. మెయిన్ కెనాల్ నుంచి రైట్‌సైడ్ భూములుగల రైతులు మోటార్లు పెట్టి అక్రమంగా నీటిని వాడుకుంటున్నారు. ఇలా వాడుకోవడం కొత్తేమి కాదు.. ఎన్నో ఏళ్ల నుంచి మోటార్ల ద్వారా నీటిని తమ భూములకు మళ్లించుకుంటున్నారు. ఈ మోటార్లన్నీ నడవడం వల్ల జోన్ 2 పరిధిలో ఆయకట్టు భూములకు సరిపడా సాగు నీళ్లు రావడం లేదు.

● ఎమ్మెల్యేల ఆందోళన..

ప్రణాళికాబద్ధంగా కాకతీయ కాలువకు ఎస్సారెస్పీ నీటిని వదులుతుండడంతో చివరి భూములకు నీరందడం లేదని పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో ఓదెల, కాల్వశ్రీరాంపూర్, సుల్తానాబాద్ మండలంలోని పలు గ్రామాల్లోని భూములకు ఎస్సారెస్పీ నీరు అందడం లేదని, ప్రతి రోజు కాలువల వెంబడి తిరుగుతున్నా, అధికారుల వెంటబడుతున్నా సరిపడా నీరు ఇవ్వడం లేదని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. ఈ విషయమై ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు సమాధానంగా డి-83, డి-86లకు బాగానే నీళ్లు ఇస్తున్నామని, అప్పుడప్పుడు లింకు కెనాల్ ద్వారా కూడా నీళ్లు వస్తున్నాయని అన్నారు. అలాగే కాకతీయ ప్రధాన కాలువపై తాము చేసిన సర్వే ప్రకారం 4,600 కరెంట్ మోటార్లను రైతులు బిగించారని, వీటి ద్వారా నీటి చౌర్యం జరుగుతున్నదన్నారు. వ్యవసాయానికి 24 గంటలు కరెంట్ సరఫరాను చేయడం వల్ల నిరంతరాయంగా మోటార్లు నడుస్తుండడంతో దిగువకు తక్కువ నీళ్లు వస్తున్నాయని అన్నారు. కరెంట్ సరఫరాను తగ్గిస్తే నీటి చౌర్యాన్ని అరికట్టవచ్చని సూచించడం గమనార్హం. కాకతీయ కాలువపై ఉన్న మోటార్ల గురించి విద్యుత్ కోతలు పెడితే, వ్యవసాయ బావులు, బోర్‌బావులు గల రైతులు ఆందోళన బాట పట్టక తప్పదు. నీటి సరఫరాపై అధికారులు, ఎమ్మె ల్యేల మధ్య సమన్వయం లేకపోవడం, అధికారులు అనుసరిస్తున్న కొత్త విధానం వల్ల చివరి ఆయకట్టు రైతులకు సరిపడా నీళ్లు అందకపోవడమే గాకుండా వృథాగా పోతున్నాయి. అధికారులు అనుసరిస్తున్న నీటి సరఫరా విధానం ప్రభుత్వం దృష్టిలో ఉందా లేదా తెలియడం లేదు. ఇదేవిధంగా నీటి సరఫరా చేస్తే మాత్రం జిల్లాలో చివరిఆయకట్టు భూములు ఎండిపోక తప్పదని రైతులు అంటున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి రైతులు వరి పంట వేశారు. ఇంకా కూడా జిల్లాలో వరి నాట్లు కొనసాగుతున్నాయి. ఇంకా మూడు మాసాల పాటు నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎస్సారెస్పీ నీటి సరఫరాపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎస్సారెస్పీ అధికారులు, ఆయకట్టు పరిధిలోని ఎమ్మెల్యేలతో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోకుంటే రైతులు పెద్దఎత్తున నష్టపోవాల్సి వస్తుంది.

జిల్లాకు డీ-83, డీ-86ల ద్వారా సరఫరా

జిల్లాకు నీళ్లు సరఫరా అయ్యే డీ-83, డీ-86ల ద్వారా పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో సుమారు 1,83,000 ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. ఇందులో అత్యధికంగా పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలోనే భూములున్నాయి. నీటి సరఫరాలో అధికారులు అనుసరిస్తున్న విధానాల వల్ల ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల్లోని కాలువ చివరి భూములకు నీళ్లు అందడం లేదని రైతులు చెబుతున్నారు. గతంలో వారం రోజుల పాటు 5,500 క్యూసెక్కుల నుంచి 6 వేల క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టి వారం రోజులు బంద్ చేయడం వల్ల రైతులకు పెద్దగా ఇబ్బందులు తలెత్తలేదు. మెయిన్ కెనాల్ నుంచి కరెంట్ మోటార్ల ద్వారా నీటి సరఫరా ఉన్నప్పుడే మోటార్లను నడిపించుకునే వాళ్లు. ఇప్పుడు రెండు జోన్లుగా విభజించి నిరంతరాయంగా నీటిని వదిలిపెట్టడం వల్ల కరెంట్ మోటార్లను నిరాటంకంగా నడిపిస్తున్నారు. దీంతో దిగువకు నీళ్లు సరిపడా రావడం లేదు. డిసెంబర్ 18వ తేదీన నీటి సరఫరాను అధికారులు ప్రారంభించారు. జనవరి 2వ తేదీ వరకు క్రమంగా 6 వేల క్యూసెక్కుల వరకు నీటిని వదిలిపెట్టారు. ఆ తర్వాత నుంచి 9వ తేదీ వరకు 3,500 క్యూసెక్కుల నీటిని వదిలిపెట్టారు. 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 6 వేల క్యూసెక్కులు, 13వ తేదీన 4,333 క్యూసెక్కులు, 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు 3,500 క్యూసెక్కులు, 25వ తేదీన 2729 క్యూసెక్కులు, 26వ తేదీన 2,500 క్యూసెక్కులు, 27వ తేదీ నుంచి 3 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



డీ-86 కాలువ ద్వారా వెళ్తున్న శ్రీరాంసాగర్ నీరు(ఫైల్)

మధ్య మధ్యలో వరద కాలువకు 2 వేల క్యూసెక్కుల నుంచి 5వేల క్యూసెక్కుల వరకు వదిలి పెడుతున్నారు. డిసెంబర్ 18న ప్రాజెక్టు నీటిమట్టం 76 టీఎంసీల నీళ్లు ఉండగా, మంగళవారం నాటికి 49.448 టీఎంసీలకు తగ్గింది. అంటే దాదాపు 26.5 టీఎంసీల సాగునీటిని ఇప్పటికే వదిలిపెట్టారు. ఒక ప్రణాళికబద్ధంగా గాకుండా ఎస్సారెస్పీ నీటిని ఇష్టారాజ్యంగా కాకతీయ ప్రధాన కాలువకు, వరద కాలువకు నీటిని వదిలిపెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆన్అండ్ఆఫ్ పద్ధతిలో కాకతీయ ప్రధాన కాలుకు 5500 నుంచి 6వేల క్యూసెక్కుల వరకు విదిలి, ఆఫ్ ఉండే సమయంలో అవసరాన్ని బట్టి వరద కాలువకు వదిలిపెడితే నీళ్లు కూడా వృథా అయ్యేవికావు. కాకతీయ కాలువకు సరిపడా గాకుండా తక్కువ మొత్తంలో నిరంతరాయంగా నీటిని వదలడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు అంటున్నారు. జిల్లాకు వరద కాలువ ద్వారా నిర్మించిన లింకు కాలువ ద్వారా అప్పుడప్పుడు నీటిని వదిలి పెట్టినప్పటికీ చివరి భూములకు నీళ్లు సరిపోవడం లేదు.

పాఠశాల విద్యా శాఖ
కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

- నిబంధనలకు విరుద్ధంగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంకు పోస్టింగ్

పెద్దపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యూటేషన్ల రద్దుతో వెనక్కివచ్చిన ఒక ఉపాధ్యాయుడికి నిబంధనలకు విరుద్ధంగా డీఈవో పోస్టింగ్ ఇవ్వడంపై ఉపాధ్యాయ వర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంథని మండలం కన్నాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంగా పని చేసిన సువర్ణవినాయక్ రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లోని ఎస్‌సీఈఆర్‌టీలో ఫారిన్ సర్వీస్‌లో పని చేసేందుకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆయాశాఖల్లో పనిచేస్తున్న, పదవీ విరమణ పొందినవారిని, తదితరులను తొలగిస్తున్నది. అలాగే డిప్యూటేషన్లను రద్దు చేస్తున్నది. అందులో భాగంగా ఈనెల 25న ఎస్‌సీఈఆర్‌టీలో పనిచేస్తున్న 10మంది ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను రద్దుచేస్తూ ప్రొసీడింగ్ ఆర్‌సీ నంబర్.98/ఎస్ఇఆర్-3-1/2024-1 జారీచేసింది. తిరిగి వారి మాతృ శాఖకు పంపించారు. డిప్యూటేషన్‌పై వెళ్లే ముందు సదరు ఉపాధ్యాయుడు ఏ పాఠశాలలో విధులు నిర్వహించారో, అక్కడ ఆ పోస్టు ఖాళీ ఉంటే అదే పాఠశాలలో పనిచేసేందుకు పోస్టింగ్ ఇవ్వాలని పాఠశాల విద్యా శాఖ కమిషనర్ పేర్కొన్నారు. అక్కడ పోస్టు ఖాళీ లేకుంటే అదే మండలంలో ఏదైనా పాఠశాలలో పోస్టు ఖాళీ ఉంటే అక్కడికి బదిలీచేయాలన్నారు. మండలంలో కూడా ఖాళీలు లేకుంటే మరెక్కడైనా సర్దుబాటు చేయాలని కమిషనర్ స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటేషన్ రద్దు కావడంతో సువర్ణవినాయక్ జిల్లా విద్యా శాఖాధికారికి రిపోర్టు చేశారు. సువర్ణ వినాయక్ పనిచేసిన కన్నాల పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ పోస్టు ఖాళీగా లేకపోగా, ఆరెంద, నాగపల్లి పాఠశాలలో హెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఏదో ఒక పాఠశాలలో పనిచేసేందుకు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా రామగిరి మండలం నాగేపల్లి పాఠశాలకు డీఈవో పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇది నిబంధనలకు విరుద్ధమని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలువురు ఉపాధ్యాయులు అంటున్నారు. మంథని మండలంలో పనిచేసే ఉద్యోగ, ఉపాధ్యాయులకు హెచ్ఆర్ఏ 11శాతం, నాగేపల్లిలో పనిచేసే వారికి 17శాతం హెచ్ఆర్ఏ ఇవ్వనున్నారు. 17శాతం హెచ్ఆర్ఏ పొందడానికే సదరు ఉపాధ్యాయుడు తన పలుకుబడిని ఉపయోగించుకుని పోస్టింగ్ తెచ్చుకుని ఉంటాడని తెలుస్తున్నది. మంథని మండలం నాగపల్లి, ఆరెంద పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పటికీ వినాయక్‌కు అక్కడ పోస్టింగ్ ఇవ్వడంలో మర్మమేమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయమై కలెక్టర్ స్పందించి నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన పోస్టింగ్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి. దీనిపై డీఈవోను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా కలెక్టర్ ఆదేశాల మేరకు పోస్టింగ్ ఇచ్చామని తెలిపారు.

పకడ్బందీగా ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్

- జిల్లా నోడల్ అధికారి కల్పన



అధ్యాపకులతో మాట్లాడుతున్న నోడల్ అధికారి కల్పన

పెద్దపల్లి కల్చరల్, జనవరి 30 : ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను ఫిబ్రవరి 1 నుంచి 15 వరకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణపై ఆమె అధికారులతో మంగళవారం పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమీక్షించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ ఇంటర్ ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి 15 తేదీ వరకు జిల్లావ్యాప్తంగా మూడు విడతలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 32 జనరల్, 16 ఒకేషనల్ ప్రాక్టికల్ కేంద్రాల్లో మూడు విడతలుగా ప్రయోగ పరీక్షలు జరుగుతాయని, దీనికి అవసరమైన వసతులు, పరికరాలు, సీసీ కెమెరా, తాగునీరు ఏర్పాటు చేశామన్నారు. ప్రయోగ పరీక్షల్లో సైన్స్ విద్యార్థులు 2698, ఒకేషనల్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 1093, రెండవ సంవత్సర విద్యార్థులు 1036మంది పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. మొదటి విడత ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు, రెండో విడత 6నుంచి 10వరకు, మూడోవిడత 11 నుంచి 15వరకు జరుగుతాయన్నారు. ప్రయోగ పరీక్షల తర్వాత ఫిబ్రవరి 16న ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలు, 17న పాత విద్యార్థులకు నైతికత మానవ విలువల పరీక్ష, ఫిబ్రవరి 19న పర్యావరణ విద్య పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, అలాగే కళాశాల యాజమాన్యాలు హాల్ టికెట్స్ ను తప్పనిసరిగా విద్యార్థులకు అందజేయాలని లేనిచో తగిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ఈ సమావేశంలో కళాశాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు, జిల్లా పరీక్షల నిర్వహణ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, జనవరి 30: రుణ రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం దరఖాస్తులను సమర్పించాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎస్.మధుసూదన చారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఆహార శుద్ధి సంస్థ ఆదేశాల మేరకు కలెక్టర్ అనుమతితో జిల్లాలో ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ స్కీం కింద 35 శాతం రుణ రాయితీతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు రుణాలు మంజూరుకు ఈనెల 31 నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. వివరాలకు జిల్లా డీఆర్‌పీ మియాపురం రామకృష్ణను సెల్ నంబర్6305345388లో సంప్రదించాలని, దరఖాస్తును కలెక్టరేట్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

దేశానికి ఆదర్శంగా నిలిచిన డాక్టర్ అంబేద్కర్

కాల్వశ్రీరాంపూర్, జనవరి 30: మండలంలోని మల్యాలలో బాబా సాహెబ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశానికి అంబేద్కర్ ఆదర్శంగా నిలిచాడన్నారు. మన రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ గొప్ప చదువులు చదివి ఆ విజ్ఞానంతో ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనార్టీ నిరుపేదలందరికి రాజకీయ, విద్యారంగంలో, రిజర్వేషన్లు ప్రవేశపెట్టించిన ఘనత అంబేద్కర్‌కు దక్కుతుందన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనతో గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్, జెడ్‌పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, సర్పంచ్‌లు లంక రాజేశ్వరి, సదయ్య, ఆకుల చిరంజీవి, ఎంపీటీసీలు రామచంద్రం, సంపత్, ఎస్‌సీ, ఎస్‌టీ కమిషన్ మెంబర్ కొంకటి లక్ష్మీనారాయణ, దళిత సంఘాల నాయకులు పాల రాజేశం, మామిడిపల్లి బాపయ్య, బొంకూరి సురేందర్, బొంకూరి మధు పాల్గొన్నారు.

ఎన్టీపీసీకి యూనియన్ల సమ్మె నోటీసు

జ్యోతినగర్, జనవరి 30 : దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16న జరిగే పారిశ్రామిక, సెక్టోరల్ సమ్మెలో రామగుండం ఎన్టీపీసీ కార్మికులు పాల్గొంటారని తెలియజేస్తూ మంగళవారం స్థానిక జేఏసీ నాయకులు యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చాయి. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేకంగా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలు పట్ల నిరంకుశ దోరణికి వ్యతిరేఖంగా జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పేరుతో ప్రత్యక్ష ఉద్యమానికి దిగాయి. దీనిలో భాగంగా ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మెకు దిగారు. సమ్మెకు ఎన్టీపీసీ యూనియన్లు మద్దతునిచ్చాయని, సమ్మెలో పాల్గొంటామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. కార్మికుడికి నెలకు 26 వేల కనీస వేతనం, 10 వేల రూపాయల పెన్షన్, 4 లేబర్ కోడ్స్, విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని తదితర 18 డిమాండ్లతో జేఏసీ సమ్మె నోటీసు ఎన్టీపీసీ యాజమాన్యానికి అందజేశారు.

సింగిల్ విండో చైర్మన్ ఎన్నికల్లో ఉద్రిక్తత..

- ఇరువర్గాల వాగ్వాదం - పోలీసుల రంగప్రవేశం



పట్టుకున్న డబ్బులను చూపిస్తున్న ఆందోళనకారులు

పెద్దపల్లి రూరల్, జనవరి 30 : పెద్దపల్లి మండలం అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘం ఎన్నికలు రచ్చరచ్చగా మారాయి. సింగిల్‌విండో చైర్మన్ దాసరి చంద్రారెడ్డిపై అవిశ్వాసం నెగ్గడంతో అధికారులు తాత్కాలిక చైర్మన్‌గా వైస్‌చైర్మన్ చింతపండు సంపత్‌ను నియమించారు. మంగళవారం చైర్మన్ ఎన్నిక కోసం జిల్లా సహకార అధికారి శ్రీమాల సమావేశం నిర్వహించారు. సంఘ కార్యాలయం ఎదుటే చైర్మన్ బరిలో దిగిన ఇద్దరు డైరెక్టర్ల మధ్య గొడవ తలెత్తింది. రెండు గ్రూపులుగా డైరెక్టర్లు విడిపోగా, ఒక వర్గం వారు కార్యాలయంలోకి కారులో వస్తుండగా, మరో వర్గం వారు అడ్డుకున్నారు. వాహనంలో ఉన్న డబ్బుల కట్టలను బయటకు తీసి వెదజల్లుతూ చైర్మన్ పదవి కోసం ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరగడంతో సమాచారం అందుకున్న పెద్దపల్లి సీఐ కృష్ణ పరిస్థితులను పర్యవేక్షించి బసంత్‌నగర్ ఎస్ఐ వెంకటేష్ ద్వారా బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు ఇరువర్గాలను కార్యాలయం నుంచి పంపించారు. ఈ నేపథ్యంలో కోరం లేకపోవడంతో చైర్మన్ ఎన్నికను బుధవారం నాటికి వాయిదా వేస్తున్నట్లు జిల్లా సహకార అధికారిణి పేర్కొన్నారు.

● ఏడాది పదవికి..

అప్పన్నపేట వ్యవసాయ సహకార సంఘంలో 13 మంది డైరెక్టర్‌లు గాను చైర్మన్ దాసరి చంద్రారెడ్డి అవిశ్వాసానికి 11 మంది మద్ధతు తెలిపారు. మరో ఏడాది కాలం పాటు ఉన్న చైర్మన్ పదవికి ఇద్దరు డైరెక్టర్‌ల మధ్య బాహబాహీగా గొడవకు దారితీసింది. చైర్మన్ పదవికోసం మద్దతు ఇస్తే ప్రతి డైరెక్టర్‌కు రూ.30 వేలు అని, మరొకరు ఏకంగా లక్ష రుపాయలు ఇస్తానని ఆశావహులు పోటీపడుతున్నారని పలువురు డైరెక్టర్‌లు పేర్కొంటున్నారు. చైర్మన్ పదవి కోసం రూ.15లక్షల వరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు చర్చ సాగుతోంది.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్‌డీఎఫ్, డీఎంఎఫ్‌టీ, సీడీపీ, సీఎస్ఆర్, తదితర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయా స్కీంల ద్వారా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతి 15రోజులకోసారి సమీక్ష నిర్వహించి పనులను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటివరకు ప్రారంభం కాని పనులలో అత్యంత అవసరమైన పనులను అధికారులు గుర్తించి వెంటనే ప్రారంభం చేయాలని సూచించారు. రోడ్లు, మురికి కాలువలు, లైటింగ్ పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మంజూరు చేసిన గర్ల్స్ టాయిలెట్ నిర్మాణ పనులు, అంగన్‌వాడీ కేంద్రాల పనులను అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలని అన్నారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ కింద మంజూరు చేసిన పనులలో ప్రారంభించిన వాటిని త్వరగా పూర్తయ్యే విధంగా చూడాలని, జిల్లా వ్యాప్తంగా ఒకే విధంగా బస్సు షెల్టర్లు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. గతంలో వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకొని అవసరమైన చోట డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. రాబోయే సమావేశానికి అధికారులు ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలు, ఆ పనులు పూర్తయ్యే తేదీని తెలియజేస్తూ రిపోర్టు సమర్పించాలని, జిల్లా వ్యాప్తంగా వాటర్ లాగింగ్ జరగకుండా అవసరమైన చోట్ల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని, వైకుంఠధామానికి రోడ్డు మార్గం ఉండే విధంగా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ, సీపీఓ గంప రవీందర్, ఈఈ పంచాయతీ రాజ్ బి గిరీష్ బాబు, పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ సీహెచ్ రషీద్, ఈఈ ఆర్అండ్‌బీ రాములు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, జనవరి 30: జంతు సంరక్షణకు పాటించాల్సిన నిబంధనలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపుకలెక్టర్లు జే.అరుణశ్రీ, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్‌తో కలిసి కలెక్టర్ జంతు సంరక్షణ చర్యలపై రూపొందించిన పోస్టర్‌ను, కుక్క కాటుకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రూపొందించిన కరపత్రంను ఆవిష్కరించారు. కలెక్టర్ ముజమ్మిల్ మాట్లాడుతూ జంతు సంరక్షణకు భారత ప్రభుత్వం జాతీయ జంతు కళ్యాణ మండలిని(ఎనిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా)ను స్థాపించిందని, వీధి కుక్కలు, జంతువులపై సానుభూతితో వ్యవహరించాలని తెలిపారు. కుక్క కాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కుక్క ఒకవేళ కరిస్తే వెంటనే తీసుకోవాల్సిన ప్రథమ చికిత్సపై ప్రచారం కల్పించాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఏ జి ప్రకారం అడవులు, సరస్సులు, నదులు వన్యప్రాణులతో సహా సహజ పర్యావరణాన్ని రక్షించడం, జీవులపట్ల కరుణ కలిగి ఉండడం ప్రతి పౌరుడి కర్తవ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రవీందర్‌రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



బొమ్మారెడ్డిపల్లిలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణ్‌కుమార్

ధర్మారం, జనవరి 30: అన్ని రంగాల్లో గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ విప్. ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ఐదు గ్రామ పంచాయతీ భవనాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలకతీతంగా గ్రామాలను అభివృద్ధిపరచనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వం గ్రామాలను అభివృద్ధి చేయడానికి దోహదపడుతుందని చెప్పారు. గ్రామాల్లో నెలకొన్న తాగు, సాగునీరు ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేయనున్నట్టు అన్నారు. ప్రధానంగా బొమ్మారెడ్డిపల్లి, పత్తిపాక, కొత్తపల్లి గ్రామాల్లో సాగునీటి సమస్య లేకుండా త్వరలోనే కలెక్టర్‌తో కలిసి పరిశీలించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసి తీరుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాం రెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పూస్కూరి పద్మజ, ఎంపీడీవో బి. జయశీల, తహసీల్దార్ రజిత పాల్గొన్నారు.

ఐదు జీపీ భవనాలను ప్రారంభించిన ప్రభుత్వ విప్

ధర్మారంలో మహిళ గ్రామైఖ్య సంఘం భవనం, బొమ్మారెడ్డిపల్లి, లంబాడితండ(బి), మల్లాపూర్, కానంపల్లి, రచ్చపల్లి గ్రామపంచాయతీ నూతన భవనాలను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మహిళలు సన్మానించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో సర్పంచ్‌లు గాగిరెడ్డి ప్రేమలతారెడ్డి, చంద్రానాయక్, వరలక్ష్మి, మనీషారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై రౌడీషీట్

● భూకబ్జా కేసులో ఇద్దరికి బెయిల్ ● మరి కొందరిని విచారించిన పోలీసులు

కరీంనగర్ క్రైం, జనవరి 30 : భూకబ్జాలు, దౌర్జన్యాలకు సంబంధించిన ఫిర్యాదులపై అరెస్టు అయి ప్రస్తుతం జైలులో ఉన్న సీతారాంపూర్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై పోలీసులు మంగళవారం రౌడీషీట్ తెరిచారు. తన భూమిలో అక్రమంగా రోడ్డు వేసి, తనను బెదిరించి 10 లక్షల రూపాయలు తీసుకున్నాడని, సీతారాంపూర్‌కు చెందిన రిటైర్డ్ టీచర్ తాటిపల్లి లింగారెడ్డి ఫిర్యాదుతో కరీంనగర్ 21వ డివిజన్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై ఈ నెల 24న కొత్తపల్లి పోలీసు ఠాణాలో కేసు నమోదు చేసి, అదే రోజు జంగిలి సాగర్‌ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. అప్పటి నుంచి జైలులోనే ఉన్న జంగిలి సాగర్ బెయిల్‌పై బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు తాజాగా కొత్తపల్లి ఠాణాలో రౌడీషీట్ తెరచారు. జంగిలి సాగర్ పలు క్రిమినల్ కేసుల్లో నిందితుడని, నేర ఘటనల్లో పాల్గొంటున్నాడని, అతనిపై 2011, 2022, 2023 లలో ఒక్కో కేసు, 2024లో రెండు కేసులు మొత్తం ఐదు కేసులు ఉన్నాయని, అతనిపై రౌడీషీట్ తెరవాలని ప్రతిపాదిస్తూ కొత్తపల్లి ఎస్ఐ కరీంనగర్ రూరల్ ఏసీపీకి పంపించగా ఈ మేరకు ఏసీపీ అనుమతి ఇచ్చారు. దీంతో కొత్తపల్లి ఎస్ఐ రౌడీషీట్‌ను తెరిచారు. జంగిలి సాగర్ కదలికలను నిత్యం గమనిస్తూ నిఘా ఉంచాలని ఏసీపీ ఆదేశించారు. భూకబ్జాలకు సంబంధించిన కేసులను దర్యాప్తు చేస్తున్న ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులు మాత్రం వారి విచారణలో భూకబ్జా జరిగిందని నిర్ధారణకు వచ్చిన సందర్భంలో మున్సిపల్, రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ఆ కేసులకు సంబంధించిన పక్కా డాక్యుమెంట్ ఆధారాలను సేకరించి కోర్టుకు సమర్పిస్తున్నట్లు తెలుస్తోంది. భూకబ్జాలకు సంబంధించిన కేసులు, ఫిర్యాదులపై ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ పోలీసు అధికారులు దర్యాప్తు చేస్తున్నప్పటికీ దీనంతటిని పోలీస్‌కమిషనర్ మానిటరింగ్ చేస్తూ ఎప్పటికప్పుడు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. నిందితులు తప్పించుకోకుండా, త్వరగా బెయిల్ రాకుండా కఠినంగా చర్యలు తీసుకుంటూ పలు సెక్షన్‌లను జోడిస్తూ కేసులను స్ట్రాంగ్ చేస్తున్నారు. మరో వైపున ఫిర్యాదులు వెల్లువెత్తుతుండటంతో బాధితుల సంఖ్య కూడా రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. బాధితులకు న్యాయం జరిగేలా, నిందితులు మళ్లీ ఇటువంటి నేరాలకు పాల్పడకుండా భయపడే విధంగా సీపీ చర్యలు చేపట్టి భూకబ్జాలపై ఉక్కుపాదం మోపడాన్ని ప్రజలు హర్షిస్తున్నారు.

● భూకబ్జాకు సంబంధించిన కేసులో ఈ నెల 17న అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న కార్పొరేటర్ తోట రాములు, బీఆర్ఎస్ నాయకుడు చీటి రామారావులకు బెయిల్ లభించింది. మంగళవారం ఉదయం ఇద్దరు జైలు నుంచి విడుదలయ్యారు. ఈ నెల 17న ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు రెండుసార్లు పోలీసు కస్టడీకి తీసుకుని విచారించారు. కాగా భూకబ్జాలు, దౌర్జన్యాలపై వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం కూడా పలువురిని పోలీసులు విచారించి కొంత సమాచారాన్ని సేకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం


మహేష్ (ఫైల్)


వంశీకృష్ణారెడ్డి(ఫైల్)

ఓదెల, జనవరి 30: మండలంలోని గోపరపల్లి శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు మృతిచెందగా మరొకరు గాయపడ్డారు. గోపరపల్లికి చెందిన దాసరి వంశీకృష్ణారెడ్డి, కాల్వ శ్రీరాంపూర్ మండలం పెగడపల్లికి చెందిన జీల మహేష్ , సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లికి చెందిన పసెట్ల సంజయ్ ముగ్గురు మిత్రులు. ఈ ముగ్గురు ఈ నెల 29న సోమవారం బైక్‌పై కొలనూర్ వైపు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనున్న చెట్టుకు ఢీకొన్నారు. ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత సుల్తానాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వంశీకృష్ణారెడ్డి(20) మృతిచెందగా, మహేష్(17) కరీంనగర్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సంజయ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు

ప్రమాదవశాత్తు బావిలో పడి గొర్రెల కాపరి మృతి

రుద్రంగి జనవరి 30: ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి గొర్రెల కాపరి మృతి చెందిన సంఘటన రుద్రంగి మండలం మానాల శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన భాగయ్య (24) అనే అనే కూలి మానాల గ్రామానికి గొర్లు మేపేందుకు వచ్చాడు. గొర్లు మేపుతున్న క్రమంలో తాగు నీటి కోసం వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. సంఘటన స్థలానికి రుద్రంగి పోలీసులు చేరుకొని గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని వెలికి తీశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ బాపిరెడ్డి తెలిపారు.

సర్పంచ్, ఉపసర్పంచ్ సస్పెన్షన్

పెగడపల్లి, జనవరి 30: మండలంలోని నామాపూర్ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి తిరుపతిలను నిధుల దుర్వినియోగం అభి యోగంలో సస్పెండ్ చేస్తూ కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎంపీవో మహేం దర్ తెలిపారు. గ్రామంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోరుబావులతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లకు గ్రామపం చాయతీ నుంచి నిధులు డ్రా చేసి, నిధులు దుర్వినియోగానికి పాల్పడ్డారని అదే గ్రామానికి చెందిన ముదుగంటి పవన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో కనకదుర్గ ఇటీవల గ్రామానికి వచ్చి రికార్డులు పరిశీలించి విచారణ చేసి నోటీసులు జారీ చేశారు. పనుల కు సంబంధించి సరైన ఆధారాలు చూపించక పోవడంతో డీఎల్‌పీవో సమర్పించిన నివేదిక మేరకు సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీవో తెలిపారు.

బాలికపై అత్యాచారం

ధర్మపురి, జనవరి 30: పట్టణంలో బాలికపై కొల్లూరి అర్జున్ (21) అనే యువకుడు అత్యాచారం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన అర్జున్ ఇటీవల మైనర్ బాలికపై అత్యాచారం చేయగా ఆమె తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై జగిత్యాల డీఎస్పీ వెంకటస్వా మి విచారణ జరిపారు. అర్జున్‌ను అరెస్ట్ చేసి రిమాండ్ పంపించినట్లు ఎస్ఐ దత్తాత్రి తెలిపారు.

కిటకిటలాడిన కొండగట్టు

● సమ్మక్క భక్తులతో పోటెత్తిన అంజన్న క్షేత్రం ● దైవదర్శనం చేసుకున్న 50వేల మంది



అంజన్న ఆలయం ఎదుట భక్తుల కోలాహలం



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

మల్యాల, జనవరి 30: కొండగట్టు అంజన్న క్షేత్రం మేడారం జాతరను తలిపించేలా మంగళవారం భక్త జనసంద్రంగా మారింది. మేడారంలో జరిగే సమ్మక్కసారక్క జాతర నేపథ్యంలో ముందుగా వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్నకు తొలి మొక్కులు తీర్చుకు నేందుకు గాను ఆలయాలను దర్శించడం ఆనవాయితీగా వస్తుండడం తో సమ్మక్క సారక్క భక్తులు కొండగట్టుకు తరలివస్తున్నారు. దాదాపు గా యాభై వేలకు వరకు భక్తులు అంజన్న ను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కి రిసాయి. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకువ జామునుంచే స్వామి వారి దర్శనానికి బారులుతీరారు. కొండంతా భక్తులతో రద్దీగా మారింది. ఆలయానికి వచ్చే మార్గాలు, కోనేరు పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అనంతరం బేతాళుడు, శ్రీరాము ల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తుల రద్దీ రోజంతా కొనసాగిం ది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు సునీల్, శ్రీనివాస్‌శర్మ, ఎస్సైలు అశోక్, కుమార స్వామి ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం నిండిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

● ఆర్జిత సేవలతో ఇబ్బందులు..

వేలాదిగా తరలివస్తున్న భక్తుల రద్దీ నేపథ్యంలో మంగళవారం, శనివారం రోజుల్లో కొద్దిరోజుల పాటు వాహనపూజలు, అభిషేకాలను కొనసాగిస్తుండడం తో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహన పూజలకు వచ్చే వాహనాలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలాగే ఆలయం లో అభిషేకాలతోనూ భక్తులకు అసౌకర్యం నెలకొం ది. ముందుగానే దేవ స్థానం అధికారులు సమాచా రం అందించి రద్దీ రోజుల్లో ఇబ్బందులు కలగకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్ పరీక్షలు

తిమ్మాపూర్, జనవరి 30: తొలివిడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. మండలం కేంద్రం లోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, పరీక్ష కేంద్రాల్లో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12గంటల మొదటి సెషన్‌లో 827మందికి 815 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 12మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు జరిగిన రెండో సెషన్‌లో 634 మందికి 620మంది విద్యార్థులు హాజరు కాగా 14మంది పరీక్షకు హాజరు కాలేదని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ లలితకుమారి తెలిపారు.



హాల్‌టికెట్‌ను తనిఖీ చేస్తున్న సిబ్బంది

స్వచ్ఛతలో తహెర్‌కొండాపూర్ ఆదర్శం



పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న యునిసెఫ్ జిల్లా సమన్వయకర్త

కరీంనగర్ రూరల్, జనవరి 30: స్వచ్ఛతలో మండలంలోని తహెర్‌కొండాపూర్ గ్రామం ఆదర్శవంతంగా ఉందని ఐదు జిల్లాల శిక్ష ణ బృందం సభ్యులు అన్నారు. సోమ, మంగళవారాల్లో తహెర్‌కొండా పూర్, చర్లబూత్కూర్ గ్రామాల్లో యూనిసెఫ్ సభ్యులు, ఐదు జిల్లాల శిక్షణ బృందం సభ్యులు పర్యటించి ప్రజెంటేషన్ అందించారు. కొమురంభీం ఆసిఫాబాద్, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల నుంచి మండల పంచాయతీ అధికారులు, ఏబీఎం కన్సల్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో కూడిన 73 మంది సభ్యుల బృందం, యూనిసెఫ్ జిల్లా సమన్వయకర్త కిషన్‌స్వామి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల రక్షణ, ఆరోగ్యం విషయాలపై రెండురోజుల శిక్షణ కార్యక్ర మంపై తహెర్‌కొండాపూర్, చర్లబూత్కూర్ గ్రామాలను సందర్శించా రు. తహెర్‌కొండాపూర్‌లో మరుగుదొడ్లు, చెత్త నిర్వహణ, మురికినీటి నిర్వహణ, షెడ్డు నిర్వహణ, అంగన్వాడి, మొక్కల పెంపకాన్ని పరిశీలిం చి, ప్రజెంటేషన్ అందించారు. చర్లబూత్కూర్‌లో పారిశుధ్య కార్మికులతో చర్చించారు. యునిసెఫ్ వాష్ కన్సల్టెంట్ ఫణీంద్రకు మార్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, ఎంపీవో జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్ మమత, మారుతి పాల్గొన్నారు.

ఆటో నుంచి పడి కంప్యూటర్ ఆపరేటర్ మృతి

ధర్మపురి, జనవరి 30: ధర్మపురి మండలంలోని బూరుగుపల్లె వద్ద ఆటో నుండి కింద పడి మ్యాన సంతోష్ (30) అనే కంప్యూటర్ ఆపరేటర్ మంగళవారం మృతి చెందాడు. స్థానిక హనుమాన్‌వాడకు చెందిన సంతోష్ వెల్గటూర్ మండల ప్రజాపరిషత్ ఆఫీస్‌లో డేటా కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. ఉదయం విధులు నిర్వర్తించేందుకు సంతోష్ ఆటోలో బయలుదేరా డు. బూరుగుపల్లె వద్దకు చేరుకున్న ఆటో డ్రైవర్ అజాగ్రత్తగా నడిపి సడెన్‌గా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి అందులో ఉన్న సంతోష్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆయనను 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ తరలిం చారు. సంతోష్ పరిస్థితి విషమించి మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుని భార్య మ్యాన సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దత్తాత్రి తెలిపారు.

బైపాస్ డిజైన్ మార్చాలి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మెట్‌పల్లి, జనవరి, 30: బైపాస్ రోడ్డు నిర్మాణంలో విలువైన వ్యవసాయ భూములను కోల్పోయి వీధిపాలవుతున్నందున డిజైన్ మార్చేందుకు ప్రజాప్రతి నిధులు, అధికారులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని రైతులు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. మండలంలోని బండలింగాపూ ర్, వెల్లుల్ల, మేడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు విలువైన వ్యవసాయ భూములు ఇచ్చేది లేదంటూ భూ సర్వేను నిలిపివేయాలని కొన్ని రోజుల కిందట రిలే దీక్షలను రైతులు చేపట్టారు. దీంతో రైతుల సమస్యలను తెలుసుకోవడానికి మంగళవారం ఆర్డీవో మధు కార్యాలయానికి పిలిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో విలువైన సాగు భూము లు కోల్పోయి తీవ్రంగా నష్టపోతామన్నారు. ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములను తీసుకుంటే జీవనోపాధి కోల్పోయి ఎలా బతకాలని అధికారులను ప్రశ్నించారు. జాతీయ రహదారుల అధికారులు రైతులను పిలిపించి పరిహారం ఎక్కువ ఇప్పించే ప్రయత్నం చేస్తామని సర్వేను కొనసాగించేందుకు సహకరిం చాలని కోరారు. దీంతో రైతులు ఈనెల 5తేదీ వరకు సర్వేను నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్, జాతీయ రహదారి అధికారులు, ఆయా గ్రామాల బాధిత రైతులు పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడికి జైలు

కరీంనగర్ లీగల్, జనవరి 30: బాలికపై అత్యాచార యత్నానికి ఒడిగట్టిన కేసులో నిందితుడైన తాళ్లపల్లి శంకరయ్య (45)కు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, వేయి రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ రెండో ప్రత్యేక పోక్సోకోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీవాణి మంగళవారం తీర్పునిచ్చారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరెల్లి రాములు కథనం మేరకు జగిత్యాల వెల్గటూర్ మండలం ఎండపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు బతుకుదెరువు కోసం చొప్పదండి గ్రామానికి వచ్చి కూలి పనిచేస్తూ జీవిస్తున్నారు. వీరికి ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ఉన్నారు. 2020 జూలై 15న ఉదయం భార్యాభర్తలు కూలి పనికి వెళ్లగా ఇద్దరు పిల్లలు ఇంటి వద్దనే ఉన్నారు. వీరిఇంటి పక్కన ఉండే తాళ్లపల్లి శంకరయ్య మధ్యాహ్నం బాలిక (9)ని తన ఇంట్లోకి తీసుకెళ్లి ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆ సమయంలో బాలిక తమ్ముడు అక్కడికి వచ్చి అది చూసి అరవడంతో ఆమెను వదిలి శంకరయ్య పారిపోయాడు. ఈ సంఘటనపై బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై అప్పటి చొప్పదండి ఎస్ఐ వంశీకృష్ణ శంకరయ్యపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరిపారు. కేసు విచారణలో సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి శ్రీవాణి నిందితుడైన శంకరయ్యకు జైలుశిక్ష, జరిమానా విధించారు.

శాస్త్రీయ కళల పరిరక్షణకు కృషి చేస్తాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - రాజన్న క్షేత్రంలో ఘనంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం





ఆరాధనోత్సవాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పంచరత్న గానం వినిపిస్తున్న కళాకారులు

వేములవాడ, జనవరి 30: శాస్త్రీయ కళలను పరిరక్షించి ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లడానికి కృషిచేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేముల వాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం ఉదయం త్యాగరాజస్వామి వారి 71వ ఆరాధన ఉత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రీయ కళల పరిర క్షణకు, మన సంస్కృతిని ప్రతిబింబించేదుకు ఇలాంటి ఉత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. మన సంస్కృతి, కళల పరిరక్షణకు ప్రభుత్వం తరఫున తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వేములవా డ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వం లో త్వరలోనే వీటీడీఏ సమావేశం నిర్వహిస్తామని, పదేళ్లుగా ఆగిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభిస్తామన్నారు. అంతకుముందు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలోని అర్చకుల బృందం స్వస్తిపుణ్యవచనము చేసి త్యాగరాజ స్వామి చిత్రపటంతో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆరాధనోత్సవాల వేదికపై త్యాగయ్య చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించగా, రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన గావించి ఆరాధనోత్సవాలను ప్రారంభించారు. తొలిరోజు కార్యక్రమాలలో భాగంగా తొలుత ఉదయం పాలెపు లక్ష్మణమూర్తి త్యాగరాజస్వామివారి జీవిత విశేషాలను వివరించగా, వి. జ్యోత్స్న లక్ష్మి, ఎం. సువర్ణ, నరహరిశర్మ, హెచ్. సతీష్, మంజుల, రేవతి, సునీత, కళ బృందము పంచరత్న గానం వినిపించారు. స్వర్ణలత, భాగవతారిణి హరికథా గానం చేయగా పద్మప్రియ సంగీత కచేరితో అల రించారు. గుమ్మడి జనార్దన్, వాణి సితార సోలో కచేరి, జె. ఉమాదేవి సంగీత కచేరితో ఆకట్టుకున్నారు. మంగళంపల్లి స్వర్ణలత శాస్త్రీయ సంగీత కచేరి, జి. రేఖ బృందం నృత్య ప్రదర్శన చేయగా, దుర్గా భవాని నాట్యమండలి వారు భక్త తులసీదాస్ చరిత్ర పౌరాణిక నాటకంతో ఆకట్టుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి డి కృష్ణప్రసాద్, ఉత్సవాల ఇన్‌చార్జి కే రామయ్యశర్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

చందుర్తి, జనవరి 30: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు సోమవారం రాత్రి మృతి చెందిన సంఘటన మండలంలోని జోగాపూర్ గ్రామం లో జరిగింది. గ్రామస్థుల పోలీసుల కథనం ప్రకారం సుతారి లచ్చిరెడ్డి (62) అనే వృద్ధుడు ఈ నెల 23న పొలం వద్ద నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తున్నాడు. గ్రామ శివారులోని శివాజీ విగ్రహం సమీపంలో మూడపల్లి చెందిన మరో వ్యక్తి ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ లచ్చిరెడ్డి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

ద్విచక్ర వాహనదారులపై దాడి... కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 30: కరీంనగర్ రాజీవ్‌చౌక్‌లో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనదారులపై దాడికి పాల్పడిన ఎండీ షాబాద్, ఎండీ సాహిల్‌లపై కేసు నమోదు చేశామని కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసు లు తెలిపారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన శానగొండ విమలాచారి, వేములవాడ రమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా రాజీవ్‌చౌక్‌లో ఒక ఒక ఆటో ఢీకొట్టింది. ఆటో డ్రైవర్‌ను ఎందుకు ఢీకొట్టావని అడిగినందుకు ఇద్దరిపై ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులు కర్రతో తలపై దాడిచేశారు. ఈ ఘటనపై అర్ధరాత్రి ఇరువర్గాల మధ్య గొడవ జరగగా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని చెదరగొట్టారు. బాధితుల ఫిర్యాదుతో నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బాల కార్మికుడి గుర్తింపు

-యజమానిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 30: కరీంనగర్ వాసవిస్ట్రీట్‌లోని మాన్సి ఫాషన్ రెడీమేడ్ షాపులో పనిచేస్తున్న రాజస్థాన్‌కు చెందిన బాల కార్మికుడు (14)ను గుర్తించిన పోలీసులు యజమాని కమలేష్కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ స్మైల్ తనిఖీల్లో భాగంగా మంగళవారం తనిఖీ బృందం వెళ్లగా షాపులో బాలుడుని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాలుడిని చేరదీసి సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచామని తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు

నలుగురు నిందితుల రిమాండ్

మెట్‌పల్లి, జనవరి 30: జల్సాలకు అలావాటు పడి డబ్బులు సరిపోక పోవడంతో సులువుగా డబ్బులు సంపాదించాలని వ్యవసాయ మోటార్లు, ట్రాక్టర్ ట్రాలీ దొంగతనాలకు పాల్పడిన నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌ల్లో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై చిరంజీవితో కలిసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని పాటిమీది తండాకు చెందిన గుగ్లావత్ నరేష్, జరుపుల ప్రకాష్, గుగ్లావత్ రవిలాల్, గుగ్లావత్ అనిల్ జల్సాలకు అలావాటు పడి మద్యానికి బానసయ్యారు. వీటికి డబ్బులు సరిపోకపోవడంతో మూడు నెలల నుంచి మండలంలోని జగ్గసాగర్, ఆత్మకూర్, వెల్లుల్ల గ్రామాలతో పాటు మల్లాపూర్ పరిసర ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్నా రు. 2023 నవంబరు 10న ఆత్మకూర్‌లోని వ్యవసాయ మోటార్లు దొంగతనం చేద్దామని వెళ్తుండగా గ్రామంలో ట్రాక్టర్ ట్రాలీని దొంగలిం చారు. గ్రామ శివారులోని పొలాల పొదల్లో దాచి పెట్టి, రెండు వ్యవసా య మోటార్లను దొంగలించి ట్రాలీ వద్ద దాచిపెట్టారు. 12 రోజుల తర్వా త మల్లాపూర్ మండలంలోని రాఘవపేటలోని నాలుగు వ్యవసా య మోటర్లు, ఈనెల 10న వెల్లుల్ల శివారులోని రెండు మోటర్లను అప హ రించారు. మళ్లీ ఈనెల 23న ఆత్మకూర్‌లోని మూడు వ్యవసాయ మో టార్లు దొంగలించారు. దొంగిలించిన మోటర్లను నిజామాబాద్‌లో అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయని తెలుసుకొని ఈనెల 30న బయలు దేరారు. సీఐ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ఎక్స్ రోడ్డు వద్ద ఎస్సై చిరంజీవి తన సిబ్బందితో నిందితులను పట్టుకున్నారు. వారినుంచి ట్రాక్టర్ ట్రాలీ, 11 వ్యవసాయ మోటర్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకున్న ఎస్సై, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



నిందితుల అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐ

పదో తరగతిలో లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్



విద్యార్థులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కోల్‌సిటీ, జనవరి 30: పదో తరగతిలో విద్యార్థులు లక్ష్యాలను చేధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. మంగళవారం ఎఫ్‌సీఐలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థులు ప్రతి రోజు పాఠశాలకు హాజరుకావాలని, విద్యార్థులు ప్రత్యేక తరగతులకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. 45రోజులు పక్కా ప్రణాళిక ప్రకారం విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని, వారికి ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. కిచెన్ గార్డెన్‌లో పెరిగే కూరగాయలు విద్యార్థులకు పౌష్టికాహారం కింద మధ్యాహ్నం భోజనం అందించడంపై ఉపాధ్యాయులను, పాఠశాల సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కలెక్టర్ వెంట మహేంద్ర టెక్ ప్రతినిధి డాక్టర్ రేవతి, జిల్లా అకాడమిక్ ఇన్‌చార్జి టీఎం షేక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు విమలాదేవి, టీచర్లు ఉన్నారు.

'ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు హాస్యాస్పదం'

మంథని, జనవరి 30: పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం కొత్తగా శాసనసభ ఆవరణలో మహాత్మా ఫూలే విగ్రహాన్ని ఆవిష్కరించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి గోటికార్ కిషన్‌జీ మంగళవారం అన్నారు. ఆమెకు మద్దతు తెలిపే నాయకులు సైతం బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విగ్రహ ఆవిష్కరణ ఆలోచన చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి

సుల్తానాబాద్, జనవరి 30 : పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు శ్రద్ధ వహించి కాలనీలను సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ అన్నా రు. మంగళవారం స్థానిక 10వ వార్డు, మెయిన్ రోడ్‌లలో పారిశుధ్య పనులను పరిశీలించి చెత్తను మురికి కాలువలో పారవేయకుండా వార్డు లోకి వచ్చే స్వచ్ఛ ఆటోలకి ఇవ్వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎలాంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్, వార్డు ప్రజలు, పలువురు పాల్గొన్నారు.

బీమా పాలసీలపై అవగాహన

పెద్దపల్లి రూరల్, జనవరి 30 : మండలంలోని గౌరెడ్డిపేట గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం తపాలా శాఖ పెద్దపల్లి డివిజన్ సూపరింటెండెంట్ ప్రభాకర్ ఆధ్వర్యంలో బీమా పాలసీలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తపాలా శాఖలో ప్రమాద బీమా పాలసీ తీసుకుని గత ఏడాది ద్విచక్ర వాహనం ప్రమాదంలో మృతి చెందిన గ్రామానికి చెందిన మిట్టపల్లి శంకరమ్మ కుమారుడైన సంతోష్‌కు పది లక్షల రుపాయల పాలసీ చెక్కును ప్రభాకర్ అందించారు. సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆకుల సునీల్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ నరేష్ అరికాల, పెద్దపల్లి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ కొట్టే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

సుల్తానాబాద్, జనవరి 30 : మండలంలోని తొగర్రాయిలో పదవీకాలం పూర్తయిన సందర్భంగా మంగళవారం ఐదు సంవత్సరాలు తమతో పాటు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించిన పంచాయతీ సిబ్బందిని గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గడ్డం అనిల్, తుమ్మ లక్ష్మీనారాయణ సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ సెక్రటరీ, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, జనవరి 30:కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మమత అన్నారు. మంగళవారం రాఘవపూర్ జడ్పీ పాఠశాలలో కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హన్మంతు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జనవరి 30: మండలంలోని కాల్వశ్రీరాంపూర్, పెగడపల్లి తదితర గ్రామాల్లో మంగళవారం కుష్టు నివారణ వారోత్సవాలు నిర్వహించారు. డిప్యూటీ పారామెడికల్ అధికారి దేవిసింగ్ మాట్లాడుతూ గాంధీ వర్ధంతి సందర్భంగా ఈనెల 13వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. హెచ్‌ఈఓలు ఆరెల్లి లక్ష్మణ్, శ్రీనివాస్, వినీత్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, జనవరి 30: మండలంలోని మూలసాలలో సీడీపీ నిధులు రూ.10లక్షలతో పద్మశాలి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంగళవారం రాత్రి ఎమ్మెల్యే విజయరమణారావు శంకుస్థాపన చేశారు.అలాగే డీఎంఎఫ్‌టీ నిధులు రూ.15 లక్షలతో నిర్మించిన మహిళ స్వశక్తి భవనానికి ప్రారంభోత్సవం చేశారు. సర్పంచ్ శంకరయ్య, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పని చేయాలి

- పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలి - కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

జ్యోతినగర్, జనవరి 30 : జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని, రానున్న 45 రోజులు పక్కా ప్రణాళికతో పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్టీపీసీలోని జడ్పీ పాఠశాల, ఫెర్టిలైజర్‌సిటీ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. ఎన్టీపీసీ జడ్పీ స్కూల్‌లో గత 3 రోజులుగా టెక్ మహీంద్రా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జీవశాస్త్ర వర్క్‌షాప్‌ను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న బోధన విధానాలను కలెక్టర్ తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు ప్రతి రోజు తప్పనిసరిగా తరగతులకు హాజరుకావాలని, అలాగే ప్రత్యేక తరగతులకు విద్యార్థులు హాజరయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుకోవాలన్నారు. విద్యార్థుల్లో పాఠ్యాంశాలపై ఆసక్తి పెంచేలా బోధన ఉండాలని సూచిం చారు. కార్యక్రమంలో టెక్ మహీంద్ర ప్రతినిధి డాక్టర్ రేవతి, జిల్లా అకాడ మిక్ ఇన్‌చార్జి షేక్, హెచ్‌ఎంల జయరాజ్, విమలాదేవి పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

చివరి ఆయకట్టుకు సాగు నీరు అందించడమే లక్ష్యం



అంకంపల్లిలో జీపీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కాల్వశ్రీరాంపూర్, జనవరి 30: చివరి ఆయకట్టు వరకు ఎస్ఆర్ఎస్పీ కాలువ ద్వారా సాగు నీరందించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని అంకంపల్లెలో రూ.20 లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న జీపీ భవనం రూ.19లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, అనంతరం మల్యాల గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించనున్న మహిళా భవనం,రూ.30లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు, డీఎంఎఫ్‌టీ రూ.20లక్షలతో గ్రామపంచాయతీ ప్రహారి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఆర్ఎస్పీ కాలువలు చెత్తతో నిండిపోయాయని, కాలువ పక్కన ఉన్న పొలం ఉన్న వారు కలుపు మొక్కలను కాలవులో వేస్తున్నారని, దీంతో ఎస్ఆర్ఎస్పీ కాలువ పేరుకుపోతుందన్నారు. పూడకుపోయిన చెత్తను తొలగిచేందుకు రూ.50 లక్షలు ఖర్చు వచ్చిందన్నారు. టేలాండ్ ప్రాంత రైతులకు ఎస్ఆర్ఎస్పీ నీరు అందించి వేసంగి పంటలను ఆదుకుంటా మన్నారు. పదేళ్లుగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వడ్ల కటింగ్‌తో రైతులు నష్టపోయారని, ఈ వేసంగిలో కటింగ్ లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అంకంపల్లె గ్రామ పంచాయతీ నిర్మా ణానికి రెండు గుంటల స్థలం విరాళంగా వచ్చిన వేల్పుల నారాయణ, వేల్పుల వెంకటేష్ లను అభినందించారు. అనంతరం మడిపల్లి శివారులో హుస్సేన్‌మియా వాగులో వస్తున్న నీటిని ఎమ్మెల్యే పరిశీలించారు. అనం తరం మడిపల్లె దేవాలయంలో పూజలు నిర్వహించారు.

సుల్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాల ఆదర్శం : కలెక్టర్

ఎలిగేడు, జనవరి 30 : ప్రభుత్వ పాఠశాలలకు సుల్తాన్‌పూర్‌లోని ఉన్నత ప్రాథమిక పాఠశాలలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తన సందేశాన్ని వినిపించారు. ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం జరిగిన 75వసంతాల వేడుకల్లో భాగంగా కలెక్టర్ సందేశాన్ని స్క్రీన్‌పై వివరింపచేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు, సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎంపీపీ తానిపర్తి స్రవంతి, ఉపసర్పంచ్ ఆకుల హరీష్, స్పెషల్ ఆఫీసర్ తిరుపతిరావు, ఎంఈవో కవిత, హెచ్‌ఎంలు నరేంద్రచారి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి



ఖనిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు



సుల్తానాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

కళ్యాణ్‌నగర్, జనవరి 30: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం గోదావరిఖని చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం శాంతియుతంగా పోరాటం చేసి బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమికొట్టారని, సత్యాగ్రహ దీక్ష వంటి కార్యక్రమాలు చేపట్టి శాంతియుతంగా దేశానికి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, నాయకులు నాయిని ఓదెలు, కొప్పుల శంకర్, పెద్దెల్లి ప్రకాష్, సుతారి లక్ష్మణ్‌బాబు, తాళ్లపల్లి యుగంధర్, బొమ్మక రాజేష్, గడ్డం శేఖర్, కళ్యాణి సింహాచలం, ఫజల్ బేగ్, రవియాదవ్, గుమ్మడి రవి, గుంపుల తిరుపతి, కనకలక్ష్మి, మాలెం మధు, కంకణాల రాజేష్, నంది వెంకటేష్, శ్రీకాంత్, సాయి, ఉదయ్‌రాజ్ పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు మాలెం మధు, మాల సంఘం నాయకుల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిట్టల వెంకటి, నగేష్, కొండ కుమార్ దాసరి రమేష్, సోగాల వెంకట్, రామస్వామి పాల్గొన్నారు. దళిత మోర్చా నాయకులు క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సుల్వ లక్ష్మీనర్సయ్య, మహావాది రామన్న, సితకారి చంద్రశేఖర్, రామకృష్ణ, కుమ్మరి మల్లేష్, బుర్ర రాము, అజయ్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జనవరి 30 : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని సుల్తానాబాద్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య భవన్ ఎదుట గల మహాత్మా గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు కొమురవెల్లి రామ్మూర్తి, కొమురవెల్లి భాస్కర్, సెక్రెటరీ పల్లా శ్రీనివాస్, వాసవి మాత దేవాలయం చైర్మన్ చకిలం మారుతి, శివాలయం చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, పట్టణ ఆర్యవైశ్య సంఘం యూత్ అధ్యక్షుడు శివనత్రి ప్రసాద్, సామాజిక సేవకులు పల్ల కిషన్, ముత్యాల కిషన్ పాల్గొన్నారు. అలాగే వాసవి మాత దేవాలయం ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని మంగళవారం సుల్తానాబాద్ పట్టణంలోని గాంధీ నగర్‌లో బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దన్నాయక్ దామోదర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, నాయకులు వినుపాల ప్రకాష్ రావు, వెంగళ దాస్ శ్రీధర్, అమ్మిరిశెట్టి రాజలింగం, తిరుపతి, శ్రీనివాస్‌తోపాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమాన్‌పూర్, జనవరి 30 : మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో గల మహాత్మాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వైనాల రాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు చింతపండు మధు, ఇనగంటి పాపారావు, బొజ్జ సతీష్, ఇరుగురాళ్ల కుమార్, బుర్ర సత్యం, ఎండి ముస్తాబ్, జంగిపల్లి కనకయ్య తదితరులు ఉన్నారు.

ధర్మారం, జనవరి 30: ధర్మారంలో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మహాత్మాగాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

మంథని, జనవరి 30 : మహాత్మాగాంధీ వర్ధంతిని స్థానిక గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహం వద్ద టీఆర్ఎస్ నేతలు, కాంగ్రెస్ నేతలు, ఆర్యవైశ్య సంఘం నేతలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ నేతలు వేర్వేరుగా మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

జూలపల్లి, జనవరి 30 : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, టిప శ్రీకర్ పాల్గొన్నారు.

ఎలిగేడు, జనవరి 30 : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్పంచ్‌లు బూర్ల సింధూజ, అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, గొల్లె కావేరి, మాడ కొండాల్‌రెడ్డి, సింగిరెడ్డి ఎల్లవ్వ, దుగ్యాల శ్వేత, తంగెళ్ల స్వప్న, విజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని కొట్టిన ప్రిన్సిపాల్‌పై పోలీసులకు ఫిర్యాదు

కోల్‌సిటీటౌన్, జనవరి 30: ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో ప్రిన్సిపాల్ విద్యార్థిని కొట్టిన ఘటనపై విద్యార్థి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం పాఠశాలలో ఏడో తరగతి చదువున్న జెట్టి వర్షిత్‌ను ప్రిన్సిపాల్ రవికాంత్ కర్రతో చితకబాదాడు. తరగతి గదిలో క్లాస్ టీచర్‌ను విద్యార్థి బూతులు తిట్టడంతో కొట్టినట్టు ప్రిన్సిపాల్ పేర్కొన్నాడు.

నియామకం

పెద్దపల్లిటౌన్, జనవరి 30: పెద్దపల్లి పట్టణానికి చెందిన ఈదునూరి ప్రేమ్‌ను పెద్దపల్లి జిల్లా మాదిగ శక్తి కో కన్వీనర్‌గా నియామకం చేసినట్లు మాదిగ శక్తి వ్యవస్థాపకులు బొంకూరి సురేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. మాదిగలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదిగే విధంగా కృషి చేయాలని మహనీయులు డాక్టర్ అంబేద్కర్, కాన్షీరామ్ ఆశయాల మేరకు ముందుకు నడుస్తూ రాజ్యాధికారానికి బాటలు వేయవలసినదిగా బొంకూరి సురేందర్ సన్ని ఆ ప్రకటనలో కోరారు.

'16న అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెలో పాల్గొనాలి'

పెద్దపల్లిటౌన్, జనవరి 30: ఐసీడీఎస్, అంగన్‌వాడీ ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న జరిగే అఖిల భారత సమ్మెలో జిల్లాలోని అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ నాయకురాలు జ్యోతి పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ అధికారికి సమ్మె నోటీసు మంగళవారం అందజేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ఈకార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.వనజారాణి జి.జ్యోతి, సహాయ కార్యదర్శి ఎస్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి



సీనియర్ సిటీజన్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జనవరి 30: సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చెప్పారు. మంగళవారం అడ్డగుంటపల్లిలోని సీనియర్ సిటిజన్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి పెన్షన్ వస్తుందా లేదా అని అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు సముచిత న్యాయం కల్పిస్తుందని, ఏమైనా సమస్యలుంటే తనకు నేరుగా తెలిపాలని చెప్పారు. అడ్డగుంటపల్లి నుంచి బృందావన్ గార్డెన్ వరకు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఇసంపల్లి సతీష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ పరామర్శించారు. సతీష్ కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్ మహంకాళి స్వామి, మాజీ కార్పొరేటర్లు చుక్కల శ్రీనివాస్, దాసరి ఉమాదేవిసాంబమూర్తి ఉన్నారు.

బ్యాంకును తరలించొద్దని వినతి

కమాన్‌పూర్, జనవరి30: ఎస్‌బీఐ బ్యాంక్‌ను వేరే చోటుకు తరలించవద్దంటూ మంగళవారం బ్యాంక్ మేనేజర్‌కు జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్, చిరు వ్యాపారులు వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌ను పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని నూతన బిల్డింగ్‌లో మార్చేందుకు బ్యాంక్ అధికారులు సిద్ధమవుతున్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న బ్యాంక్ సమీపంలో ఉన్న చిరు వ్యాపారులు బ్యాంక్‌పై ఆధారపడి జీవిస్తున్న నేపథ్యంలో బ్యాంక్‌ను తరలిస్తే తమకు ఉపాధి పోయే అవకాశం ఉందని, దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫోటో స్టూడియో శ్రీనివాస్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కుక్క చంద్రమౌళి, భూమయ్య, జ్యోతి, స్రవంతి, జంగాపల్లి అజయ్ తదితరులు ఉన్నారు.

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు

కమాన్‌పూర్, జనవరి 30: డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్య క్షులు బోయిని కిరణ్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ సుదర్శన్‌రెడ్డి, మండల బాధ్యులు మల్లేశ్వరరావు, రమేష్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

కమాన్‌పూర్, జనవరి 30 : కమాన్‌పూర్ మండలం పెంచికల్‌పేట గ్రామంలోని పద్మాపణి సొసైటీ సౌజన్యంతో గ్రామ సర్పంచ్ కొండ వెంకటేష్ అధ్యక్షతన ఉచిత వైద్య శిబిరం జరిగింది. వైద్యులు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రవిసింగ్, మండల వైద్యాధికారి అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ఆనందచారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'సింగిల్‌విండో చైర్మన్ రాజిరెడ్డికి మద్దతు'

ముత్తారం, జనవరి 30: ముత్తారం మండలం సింగిల్‌విండో చైర్మన్‌గా గుజ్జుల రాజిరెడ్డికే పూర్తి మద్దతు అని సింగిల్‌విండో ఉపాధ్యక్షులు పోతిపెద్ది రమణారెడ్డి, డైరెక్టర్లు గిరి వీరేందర్, కొంకటి మల్లయ్య, అల్లం నిర్మల పాపయ్యలు అన్నారు. మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో సంఘం సమావేశం సందర్భంగా అధ్యక్షులు గుజ్జుల రాజిరెడ్డికే తమ మద్దతు ఉంటుందని చైర్మన్‌తో కలిపి నలుగురు డైరెక్టర్లు తీర్మానం చేశారు. ఈకార్యక్రమంలో ముత్తారం ఎంపీపీ ముత్తయ్య, వైస్ ఎంపీపీ రవీందర్‌రావు, బీఆర్ఎస్ అధ్యక్షులు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు కుమార్, రైతుబంధు అధ్యక్షులు అత్త చంద్రమౌళి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ముత్తారం, జనవరి 30: మండల కేంద్రానికి చెందిన ఓ దినపత్రిక విలేకరి దేవర్నేని శ్రీధర్‌రావు తల్లి ప్రమీల ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ముత్తారం మండలం మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ, ముత్తారం సర్పంచ్ తూటి రజిత-రఫీ, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గాదం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడి కొండాల్ రెడ్డి, డాక్టర్ చారికోల విజయ్,గుడి రాములు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై డ్రైవర్లకు అవగాహన

రామగిరి, జనవరి 30: రహదారి భద్రతపై ఎంవీఐ ఫారుఖ్ మంగళవారం ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు విధిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం రోడ్డు సేఫ్టీ కరపత్రాలను ఆటో డ్రైవర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీసీ డ్రైవర్ తిరుపతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

రామగిరి, జనవరి 30: మండలంలోని కల్వచర్ల, లద్నాపూర్ గ్రామాల్లో బాధిత కుటుంబాలకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. అనారోగ్య కారణంగా మృతి చెందిన కాదారి లక్ష్మయ్యకు మాజీ జడ్పీటీసీ గంటవెంకటరమణరెడ్డి, వార్డు సభ్యుడు రూ. 6వేల ఆర్థిక సహాయం అందించగా, లద్నాపూర్ గ్రామంలో మామిడి రాజేశం కుటుంబానికి 50 కేజీల బియ్యం పంపిణీ చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రొడ్డబాపన్న, వెము కనకయ్య, వనం రాంచందర్‌రావు, ప్రవీణ్, తొగరి చంద్రయ్య, తొట్ల మధునయ్య, తదితరులు పాల్గొన్నారు.

బొట్లవనపర్తి జీపీ భవనం ప్రారంభం

ధర్మారం, జనవరి30: ధర్మారం మండలం బొట్లవనపర్తిలో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంగళవారం ఆ గ్రామ సర్పంచ్ రెడపాక ప్రమీలశ్రీనివాస్, మోతె సుజాత ప్రారంభించారు. పంచాయతీ పాలకవర్గం పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా సర్పంచ్ ప్రమీల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులను ఎంపీటీసీ సభ్యురాలు మోతె సుజాత ఆధ్వర్యంలో గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.

సివిల్ రైట్స్ డే

కాల్వశ్రీరాంపూర్, జనవరి 30: మండలంలోని మడిపల్లి గ్రామంలో గల ఎస్సీ కాలనీలో మంగళవారం సివిల్ రైట్స్ డే కార్యక్రమం జరిగింది. కాలనీలోని సమస్యలను తహసిల్దార్ జాహెద్‌పాషా కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనేటి సంపత్, సర్పంచ్ వడిగొప్పల రాణిమోహన్, ఆర్ఐ నర్సింగం, వీఆర్ఏ విష్ణు పాల్గొన్నారు.



అధికారుల సమస్యల పరిష్కారానికి సహకరించాలి



జీఎంలను కలిసిన అధికారుల సంఘం నూతన కార్యవర్గం

రామగిరి, జనవరి 30: ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో సమస్యల పరిష్కారానికి సహకరించాలని అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ కోరారు. మంగళవారం అధికారుల సంఘం అధ్యక్షుడిగా వెంకటరమణ కమిటీ నాయకులు తొలిసారిగా ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లను మర్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంటగా ఉపాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, శ్రీకాంత్, శ్రీనివాస్, కార్యదర్శి రమేశ్, కోశాధికారి శ్రావణ్, సంయుక్త కార్యదర్శి మహేందర్‌లు ఉన్నారు.

ఆర్జీ-2లో సర్వే మజ్దూర్ రాత పరీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 30: ఆర్జీ-2లో పనిచేస్తున్న జనరల్ మజ్దూర్ ఇంటర్నల్ ఉద్యోగులకు సర్వేమజ్దూర్ ఎంపిక కోసం మంగళవారం యాజమాన్యం రాత పరీక్ష నిర్వహించింది. సెక్టార్-3 సింగరేణి పాఠశాలలో ఎస్వోటూ జీఎం అబ్దుల్‌సలీం ప్రశ్నాపత్రాల సీల్ ఓపెన్ చేసి, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. మొత్తం 5ఖాళీలకు 137మంది దరఖాస్తు చేసుకుని, 119 మంది పరీక్షకు హాజరయ్యారు. సాయంత్రం జీఎం ఆఫీస్ నోటీస్ బోర్డులో ఫలితాలను ప్రకటించారు. ఏరియా అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్, సర్వే అధికారి బుక్క దేశాయి, డీవైపీఎం వేణుగోపాల్, సీనియర్ సర్వే అధికారి ఫణీంద్ర, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్‌లు పరీక్ష నిర్వహణ బాధ్యతలు చూశారు.

మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాల నిర్వహణపై సమీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 30: ఆర్జీ-2 ఏరియాలో నిర్వహించనున్న మల్టీ డిపార్ట్‌మెంట్ సమావేశాల నిర్వహణపై మంగళవారం యాజమాన్యం సమీక్షా సమావేశం నిర్వహించింది. జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, ఉత్తమ ఉద్యోగు లకుగా ఎంపికైన వారిని నుండి అధికారులు సూచనలు, సలహాలు తీసుకున్నారు. మల్టీడిపార్ట్‌మెంట్ సమావేశాల నిర్వహణ అంశాలు, ఇతర విషయాలపై ఈ సమావేశంలో చర్చించారు. 2023-24 సంవత్సరంలో కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకత, 2024-25లో వార్షిక లక్ష్యాలు, భూగర్భ గనులు ఓసీపీలలో యంత్రాల వినియోగం, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు సంస్థ భవిష్యత్తు, ఎదురుకానున్న సవాళ్లు, లక్ష్యాలను సాధించడానికి అనుసరించాల్సిన వ్యూహాలు వంటి అంశాలపై గనులు, డిపార్ట్‌మెంట్‌ల వారిగా సమావేశాలను వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఏరియా ఇంజనీర్ నరసింహారావు, సేఫ్టీ ఆఫీసర్ రవీందర్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, డీజీఎం ఐఈ మురళీకృష్ణ, డీజీఎం ఫైనాన్స్ వెంకటరామచంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో చర్చిస్తున్న అధికారులు



సీహెచ్‌పీ ఉద్యోగులతో మాట్లాడుతున్న సేఫ్టీ జీఎం

సీహెచ్‌పీని తనిఖీ చేసిన సేఫ్టీ జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 30: ఓసీపీ-3 సీహెచ్‌పీని సింగరేణి సేఫ్టీ జీఎం గురువయ్య మంగళవారం తనిఖీ చేశారు. సీహెచ్‌పీ నుండి బొగ్గు రవాణాను సమీక్షించారు. బొగ్గు రవాణాలో పాటిస్తున్న రక్షణ చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సురక్షితమైన పని విధానం, రక్షణ పరికరాలు ధరించడం, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు వంటి విషయాలపై ఉద్యోగులకు గురువయ్య సూచనలు చేశారు. గురువయ్య వెంట జీఎం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ, పీఓ మధుసూదన్, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, వీఈ రాజాజీ, మేనేజర్ రమేష్, సీహెచ్‌పీ ఇంచార్జి సదానందం ఉన్నారు.

ఆర్జీ-3 ఏరియాలో పర్యటించిన జీఎం సర్వే

రామగిరి, జనవరి 30: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2ను సర్వే జనరల్‌మేనేజర్ (కార్పొరేట్) శశికాంత్ రవి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వ్యూపాయింట్ నుంచి పనిస్థలాలను పరిశీలించారు. మైన్ జీవిత కాలం పెంచే విధంగా ఎలాంటి ప్రణాళికలను రూపొందించుకోవాలన్న విషయాలను సంబంధిత అధికారులకు సూచించారు.

ఆయన వెంట ఏరియా సర్వే అధికారి జైనుల్లాబద్దీన్, డీజీఎం (కార్పొరేట్) వెంకటేశ్వర్లు, సర్వే అధికారి జి. ఎల్ రాజులతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



ప్రాజెక్టును పరిశీలిస్తున్న సర్వే జీఎం